క్లుప్తంగా

అలరించిన నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన శ్రీవాగ్దేవి కూచిపూడి నృత్యాలయానికి చెందిన చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై శనివారం సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం నృత్య ప్రదర్శన జరిగింది. శివాష్టకం, కొండలలో నెలకున్న కోనేటి రాయుడు వంటి పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు కళావేదిక వద్ద చిన్నారుల నృత్య ప్రదర్శనను ఆద్యంతం ఎంతో ఆసక్తిగా వీక్షించారు. నృత్య ప్రదర్శన ఇచ్చిన చిన్నారులను అభినందించడంతో పాటు వారితో ఫొటోలు, సెల్ఫీలు దిగారు. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు.

చంద్రబాబు తక్షణమే క్షమాపణ చెప్పాలి

వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం నగర అధ్యక్షుడు శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రజాగళం యాత్రలో శింగనమల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులుపై చంద్రబాబునాయుడు చేసిన వ్యాఖ్యలను ఎస్సీ విభాగం నగర అధ్యక్షుడు బూదాల శ్రీనివాసరావు ఓ ప్రకటనలో ఖండించారు. టిప్పర్ డ్రైవర్‌కు జగన్ ఎమ్మెల్యే సీటు ఇచ్చాడని అవహేళనగా మాట్లాడి చంద్రబాబు తాను కులోన్మాది అని మరోమారు నిరూపించుకున్నారని అన్నారు. పేదల పట్ల, ప్రత్యేకంగా మాదిగల పట్ల చంద్రబాబుకు చులకన భావమని పేర్కొన్నారు. ఉన్నత విద్యావంతుడైన మాదిగ కులానికి చెందిన వీరాంజనేయలు పొట్టకూటికోసం డ్రైవరు వృత్తి చేయడం నేరమా? అని ప్రశ్నించారు. గతంలో చంద్రబాబు ఎస్సీల్లో ఎవరైనా పుడతారా? అని, బీసీల తోకలు కత్తిరిస్తా అంటూ కులోన్మాదంతో వ్యవహరించి ఆయా వర్గాల ఆగ్రహానికి గురైన విషయాన్ని గుర్తుచేశారు. వీరాంజనేయులును అవమానించే రీతిలో వ్యాఖ్యలు చేసిన చంద్రబాబు తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

సైబర్ సెక్యూరిటీపై పట్టు సాధించాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు సైబర్ సెక్యూరిటీపై పట్టు సాధించాలని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి పి.లక్ష్మణస్వామి అన్నారు. ఆ కళాశాల సీఎస్ఈ, ఐటీ విభాగాల ఆధ్వర్యంలో హ్యాకథాన్ పేరుతో సైబర్ సెక్యూరిటీపై విద్యార్థులకు శిక్షణా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ సభలో లక్ష్మణస్వామి మాట్లాడుతూ కంప్యూటర్ విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీలో విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు సైబర్ సెక్యూరిటీకి సంబంధించి వస్తున్న నూతన ఆవిష్కరణలను, మార్పులను గమనిస్తూ వాటిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సుప్రజా టెక్నాలజీస్ ఎండీ చలవాది సంతోష్ మాట్లాడుతూ విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీ అంశంలో చాలా వేగవంతమైన మార్పులు జరుగుతున్నాయన్నారు. వాటిపై శిక్షణ తీసుకోవటానికి విద్యార్థులు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జీ లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ పతంజలిశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

కేశఖండన శాలలో సిబ్బంది అనుచిత ప్రవర్తన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి కేశఖండన శాలలో విధులు నిర్వహిస్తున్న నాయీబ్రహ్మణులు అనుచితంగా ప్రవర్తించిన ఘటన శనివారం చోటుచేసుకుంది. టికెట్ విషయంలో ఒకరినొకరు తోసుకోవడమే కాకుండా భక్తుల ఎదుటే దూషణకు దిగారు. దీంతో సదరు విషయాన్ని కేశఖండనశాల సూపరింటెండెంట్ ఆలయ ఈఓ కె.ఎస్.రామరావు దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యవహారంపై ఈఓ సీరియస్ అయినట్లు తెలుస్తోంది. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం కేశఖండన శాలలో కౌంటర్ నంబర్ 13లో పమ్మి నాగేశ్వరరావు, 14లో పిఠాపురం ఉమాశంకర్ భక్తులకు తలనీలాలు తీస్తుంటారు. శనివారం ఉదయం 10గంటల సమయంలో ఓ భక్తుడికి తలనీలాలు తీసే విషయంలో వీరిద్దరి మధ్య వివాదం చోటుచేసుకుంది. దీంతో నాగేశ్వరరావు, ఉమాశంకర్‌లు నోటికి వచ్చినట్లు దూషించుకోవడమే కాకుండా భక్తుల ఎదుటే ఒకరినొకరు నెట్టుకున్నారు. ఇంతలో విషయం తెలుసుకున్న సూపరింటెండెంట్ డీవీవీ సత్యనారాయణ కేశఖండనశాలకు వెళ్లి ఏం జరిగిందని ఆరా తీశారు. అయితే అప్పటికి కూడా ఏం జరగలేదని విషయాన్ని దాచేందుకు ప్రయత్నించారు. తోటి సిబ్బంది, భక్తులు జరిగిన విషయాన్ని సూపరింటెంటెంట్‌కు తెలియజేశారు. మూడు నెలల కిందట ఉమాశంకర్ ఇదే సూపరింటెండెంట్‌తో జరిగిన వివాదంలో ఆయనపైకి కుర్చీ ఎత్తడం అప్పట్లో తీవ్ర స్థాయిలో విమర్శలకు దారితీసింది. అధికారులు హెచ్చరించినా పరిస్థితిలో మార్పు రాకపోగా, ఓ అడుగు ముందుకు వేసి భక్తుల ఎదుటే దూషణలకు దిగారు. ఇద్దరి మధ్య జరిగిన వివాదంపై కేశఖండనశాల సూపరింటెండెంట్, ఏఈఓలు విషయాన్ని ఈఓ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఈఓ ఎలాంటి చర్య తీసుకుంటారో వేచి చూడాలి.

అన్ని వర్గాలకు అందుబాటులో ఉంటా

- వైఎస్సార్ సీపీ పశ్చిమ అభ్యర్థి షేక్ ఆసిఫ్
- ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తా



ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఆసిఫ్, నాయకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ తెలిపారు. ప్రతి వ్యాపారికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ ప్రముఖ వ్యాపార కూడలి 37వ డివిజన్ పరిధిలోని తారాపేట ఎంకే బేగ్ మున్సిపల్ కాంప్లెక్స్ ఓల్డ్ పైప్ అండ్ టూల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ దుకాణదారులను కలిసి మద్దతు కోరారు. స్థానిక కార్పొరేటర్ మండేపూడి చటర్జీ పార్టీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓల్డ్ పైప్ అండ్ టూల్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి షేక్ జిలాని, కోశాధికారి ఏకాంబరేశ్వరరావు, సహాయ కార్యదర్శి షేక్ కరిముల్లా తదితరులతో ప్రత్యేకంగా సమావేశమై వ్యాపారుల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం, నగరపాలక సంస్థ నుంచి అవసరమైన సహకారం అందిస్తామని, ప్రతి సమస్య పరిష్కరిస్తామని ఈ సందర్భంగా ఆసిఫ్ అసోసియేషన్ నేతలకు హామీ ఇచ్చారు.

కోట్ల రూపాయలతో అభివృద్ధి..

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల ప్రజలు, వ్యాపారులు సంతోషంగా ఉన్నారన్నారు. రెండేళ్లు కరోనా వల్ల పేదలు ఎటువంటి పని చేయలేని స్థితిలో ఉన్నా సంక్షేమ పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాలో ఆయా పథకాల డబ్బులను జమ చేసి ఆదుకున్నారని తెలిపారు. అందువల్ల పేదలు ఆకలితో అల్లాడకుండా ఆత్మగౌరవంతో జీవించగలిగారన్నారు. వ్యాపారాలు పూర్తిగా దెబ్బతినకుండా కాపాడారని వివరించారు. రెండు నెలలుగా గడప గడపకూ వెళ్లి ప్రజలను కలిశామని, ప్రతి ఒక్కరూ సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పాలన పట్ల సంతోషంగా ఉన్నట్లు చెప్పారన్నారు. అదేవిధంగా పశ్చిమ నియోజకవర్గాన్ని వందల కోట్లరూపాయలతో అభివృద్ధి చేశామని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్ అన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. నిరంతరం అందరికీ అందుబాటులో ఉండే తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఏపీ జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి, కార్పొరేటర్లు యలకల చలపతిరావు, స్థానిక డివిజన్ అధ్యక్షుడు గ్రంధి బుజ్జి, అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు దొండ కుమార్, ఎండీ ఇంతియాజ్, బి.రమణమూర్తి, షేక్ బాజీ, కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పేదల పక్షాన సామాన్యుడు ఆసిఫ్



ఇఫ్తార్‌లో ప్రార్థనలు చేస్తున్న గౌస్ మొహిద్దీన్, జావిద్ తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలో పెత్తందారుపై పేదల పక్షాన సామాన్య కార్యకర్తను పోటీకి నిలబెట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధ్యక్షుడు షేక్ గౌస్ మొహిద్దీన్ అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని శనివారం సాయంత్రం 47వ డివిజన్‌లోని కుండల మార్కెట్ వద్ద గల హుస్సేని మసీదులో జరిగిన ఇఫ్తార్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ కుమారుడు షేక్ జావిద్, అల్లుడు షేక్ అఫ్సర్‌తో కలిసి పాల్గొన్నారు. అనంతరం గౌస్ మొహిద్దీన్ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీలకు ప్రాధాన్యం పెరిగిందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండు అడుగులు ముందుకేసి వారి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని చెప్పారు. ఇటువంటి సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటే తప్ప మైనార్టీల అభివృద్ధి సాధ్యం కాదన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ముతవల్లి ఇమామ్ షహబుద్దీన్, మసీదు పెద్దలు ఎండీ రఫీ, షేక్ బాషా, సంధాని, షేక్ ఖాదర్ షరీఫ్ తదితరులు ఆసిఫ్ విజయానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.

ఆసిఫ్‌ను కలిసిన వంగవీటి నరేంద్ర



ఆసిఫ్‌ను సత్కరిస్తున్న వంగవీటి నరేంద్ర

భవానీపురం(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్‌ను వైఎస్సార్ సీపీ నాయకుడు వంగవీటి నరేంద్ర శనివారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. విద్యాధరపురంలోని పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయానికి విచ్చేసిన నరేంద్ర ఆసిఫ్‌ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఎక్కడ నుంచో వచ్చి ఇక్కడ పోటీలో నిలబడిన పెత్తందారుపై స్థానికుడైన మిమ్మల్ని ఎన్నికల బరిలోకి దింపిన సీఎం జగనన్నకు ధన్యవాదాలు తెలుపుతున్నానని చెప్పారు. నియోజకవర్గ ప్రజలకు కావాల్సింది పిలిస్తే పలికేవాడని, వలస వచ్చిన వారు కాదని స్పష్టం చేశారు. తనకు మద్దతు తెలిపిన వంగవీటి నరేంద్రకు ఆసిఫ్ కృతజ్ఞతలు తెలిపారు. తనకు కొండంత అండగా సీఎం జగనన్న ఉండగా ఎవరెన్ని కుట్రలు పన్నినా ఆయన ఛరిష్మాతో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాగ శ్రీను, సతీష్, పి.నవీంద్ర, సుందర్, పండు, బాబు, సాయి తేజ, గణేష్, లక్ష్మీకాంత్, మండల శ్రీను పాల్గొన్నారు.

6న సిద్ధార్థలో విశ్లేషక్ - 2కే24



పోస్టర్‌ను ఆవిష్కరించిన కళాశాల ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): బిజినెస్ అనలిటిక్స్ కోర్సు చదువుతున్న విద్యార్థులకు విశ్లేషక్ - 2కే24 పేరుతో ఏప్రిల్ 6వ తేదీన తమ కళాశాల ఆవరణలో వారు చదువుతున్న పాఠ్యాంశాలతో పాటు వివిధ సాంస్కృతిక అంశాల్లో రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహిస్తున్నామని పీబీ సిద్ధార్థ కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు చెప్పారు. ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను కళాశాలలో శనివారం ఆవిష్కరించారు. బాబూరావు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందించడానికి ఈ పోటీలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల మాట్లాడుతూ డేటా గేమ్, బిజినెస్ క్విజ్, స్టార్టప్ ఐడియా, స్పాట్ ఫొటోగ్రఫీ, మిస్టర్ అండ్ మిస్ అంశాల్లో విద్యార్థులకు పోటీలు జరుగుతాయన్నారు. రాష్ట్రంలోని వివిధ ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలల్లోని విద్యార్థులు ఈ పోటీలకు హాజరవుతారన్నారు. పోటీల విజేతలకు అదే రోజు సాయంత్రం బహుమతులు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● ఉత్సాహంగా 2కే రన్





స్వీప్ కార్యక్రమంలో భాగంగా విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 2కే రన్ ఉత్సాహంగా సాగింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం ప్రాంగణం నుంచి 2కే రన్‌ను కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, సీపీ టీకే రాణా, జేసీ సంపత్ కుమార్, విజయవాడ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులతో కలిసి ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ ఓటు వేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

సీఎం జగన్ పాలనలోనే కాపుల సంక్షేమం, అభివృద్ధి

వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు ఆకుల శ్రీనివాస కుమార్



భవానీపురం(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనలోనే కాపు సామాజికవర్గం సంక్షేమం, అభివృద్ధి జరిగిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు, కాపు నేత ఆకుల శ్రీనివాస కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాపులు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎదిగేందుకు సీఎం జగన్ రానున్న ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 31 మందికి ఎమ్మెల్యే టికెట్లు, ఐదు ఎంపీ సీట్లు ప్రకటించారని తెలిపారు. కానీ టీడీపీ కూటమి 23 ఎమ్మెల్యే (టీడీపీ 14, జనసేన 9), మూడు ఎంపీ సీట్లు మాత్రమే ఇచ్చిందంటే కాపుల సంక్షేమంపట్ల వారికున్న చిత్తశుద్ధి తేటతెల్లమవుతుందని అన్నారు. కాపు సామాజికవర్గానికి జగన్ ప్రభుత్వం చేసిన మంచి గత 60 ఏళ్లలో ఏ ప్రభుత్వమూ చేయలేదని పేర్కొన్నారు. చంద్రబాబు ముసుగులో ఉన్నందునే పవన్ కల్యాణ్‌కు కాపులు వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. కాపులకు చంద్రబాబు చేసిన సాయం రూ.1,340 కోట్లు మాత్రమేనని, కానీ సీఎం జగన్ ప్రభుత్వం కాపు నేస్తం ద్వారా అందించిన సాయం రూ.2,029 కోట్లని ఆకుల వివరించారు.

కాపులకు చేకూర్చిన లబ్ధి రూ.39,247 కోట్లు

గత 52 నెలల్లో 77 లక్షల మంది కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాల లబ్ధిదారులకు డీబీటీ ద్వారా రూ.22,333 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ.16,914 కోట్లు అందిందని తెలిపారు. మొత్తం మీద రూ.39,247 కోట్ల మేర సీఎం జగన్ ప్రభుత్వం లబ్ధి చేకూర్చిందన్నారు. గత ఎన్నికలకు ముందు కాపులను బీసీల్లో కలుపుతానని చంద్రబాబు ఇచ్చిన హామీని నెరవేర్చమని పోరాడిన ముద్రగడ కుటుంబాన్ని ఎంతగా హింసించిందో అందరికీ తెలిసిందేనని పేర్కొన్నారు. తుని రైలు దహనం కేసులో కుట్రపూరితంగా వందలాది మంది కాపు యువతపై చంద్రబాబు కేసులు పెట్టిస్తే అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి వారందరిపై కేసులు ఎత్తి వేయించారని గుర్తు చేశారు. చంద్రబాబుపై దుమ్మెత్తిపోసిన పవన్ కల్యాణ్ తరువాత అతని పార్టీతో అనైతిక పొత్తు పెట్టుకున్నాడని ఎద్దేవా చేశారు. అమరావతి రాజధాని అనేది ఒక కుల రాజధాని మాత్రమేనని, అక్కడ ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రజలు బతకగలరా అని ప్రశ్నించారు. రేపు పిఠాపురంలో పవన్‌ను ఓడించేది చంద్రబాబేనని తెలిపారు.

సామాన్యులంటే చంద్రబాబుకు చులకన భావం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సామాన్యులంటే చంద్రబాబునాయుడికి చులకన భావమని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సామాన్యులే చంద్రబాబుకు బుద్ధి చెబుతారని వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్.మెహరాజ్ పేర్కొన్నారు. శింగనమల వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు పట్ల చంద్రబాబునాయుడు చేసిన వ్యాఖ్యలను మెహరాజ్ శనివారం ఓ ప్రకటనలో ఖండించారు. టిప్పర్ డ్రైవర్ అయితే ఎడమ చేతితో వేలిముద్ర వేస్తాడని చంద్రబాబునాయుడు చేసిన వ్యాఖ్యలు యువతను కించపరచడమేనన్నారు. ఉన్నత చదువులను అభ్యసించిన వీరాంజనేయులు వ్యక్తిత్వంలో చంద్రబాబు కంటే ఎంతో గొప్పవాడన్నారు. ఓ సామాన్య వ్యక్తిని గుర్తించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వీరాంజనేయులకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాన్ని ఇచ్చి ఒక కార్మిక వర్గానికి ప్రతినిధిగా చట్టసభకు పంపాలని నిర్ణయించుకున్నారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం పట్ల ప్రజలు హర్షిస్తున్నారన్నారు. చంద్రబాబునాయుడు తన అగ్రకుల అహంకారంతో మాట్లాడుతూ కార్మిక వర్గంపై సవతి ప్రేమ చూపుతున్నారన్నారు. సామాన్యులు, బీసీలంటే చులకన భావం ఉన్న చంద్రబాబుకు ప్రజలే తగిన రీతిలో బుద్ధి చెబుతారని చెప్పారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన వివాహిత చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఘటనపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లికి చెందిన పడిగల సీతారామయ్య, సుశీల భార్యాభర్తలు. వీరికి నాలుగేళ్ల కుమార్తె ఉంది. పాపకు కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతుండగా, ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయిస్తున్నారు. మెరుగైన వైద్యానికి డబ్బులు ఉండటం లేదని ఆవేదన చెందిన సుశీల ఈ నెల 26న ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగింది. సుశీల పరిస్థితిని గమనించిన సీతారామయ్య చెల్లెలు పార్వతి వెంటనే విషయాన్ని అన్నకు చెప్పింది. సుశీలను ఆటోలో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా, వైద్యం అందించారు. అయితే ఆరోగ్య పరిస్థితి విషమించడంతో శనివారం తెల్లవారుజామున మృతి చెందింది. ఘటనపై సమాచారం అందుకున్న కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం విక్రేత అరెస్ట్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అక్రమంగా విక్రయిస్తున్న బీర్, మద్యం బాటిల్స్‌ను కొత్తపేట పోలీసులు శనివారం స్వాధీనం చేసుకోవడంతో పాటు ఓ యువకుడిని అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సెక్టార్ ఎస్ఐ ఎల్.దేవసుధ శనివారం ఉదయం లంబాడీపేటలో గస్తీ నిర్వహిస్తుండగా, ఓ యువకుడు అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించాడు. సదరు యువకుడిని అదుపులోకి తీసుకుని ఆరా తీయగా, ఆ యువకుడు మాతంగి భార్గవ్(23)గా గుర్తించారు. నిందితుడు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించారు. యువకుడిని అరెస్ట్ చేయడంతో పాటు మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

చంద్రబాబుకు తగిన బుద్ధి చెబుతాం

- బాబు వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకపోతే తీవ్ర పరిణామాలు
- చంద్రబాబుకు డ్రైవర్ల హెచ్చరిక

భవానీపురం(విజయవాడపశ్చిమ): నిరుపేద కుటుంబానికి చెందినవారు, టిప్పర్ డ్రైవర్‌గా, ఉపాధి హామీ కూలీగా పని చేసేవారు ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేయకూడదా అంటూ లారీ, టిప్పర్, ఆటో డ్రైవర్లు టీడీపీ అధినేత చంద్రబాబును ప్రశ్నించారు. శింగనమల, మడకశిర నియోజకవర్గాల ఎమ్మెల్యే అభ్యర్థులుగా వీరాంజనేయులు, లక్కప్పల పేర్లను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడంపై డ్రైవర్లు, సామాన్యులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. చంద్రబాబు పెత్తందారులైన కోటీశ్వరులకు మాత్రమే టికెట్లు ఇస్తుంటే.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమలాంటి సామాన్యులకు టికెట్లు ఇచ్చి అందలమెక్కించాలనుకోవడం తప్పా అని నిలదీశారు. రెండు ఎకరాల నుంచి వేల కోట్ల రూపాయలకు ఎదిగిన చంద్రబాబు గతంలో ఎస్సీల్లో పుట్టాలని ఎవరైనా అనుకుంటారా అని చేసిన వ్యాఖ్యలు ఇప్పటికీ అందరికీ గుర్తున్నాయని పేర్కొన్నారు. మత్స్యకారులను తోలు తీస్తానని, నాయీబ్రాహ్మణులను తోకలు కత్తిరిస్తానని హెచ్చరించిన మిమ్మల్ని ఎలా మరిచిపోతారనుకున్నారని మండిపడ్డారు. ఆత్మగౌరవంతో వృత్తి చేసుకునేవారిని అవహేళన చేస్తారా.. అటువంటి మీ కూటమిని నమ్మి ఓట్లు ఎందుకు వేయాలని ప్రశ్నిస్తున్నారు. దళితుల ఎదుగుదలను జీర్ణించుకోలేకపోతున్న చంద్రబాబు అండ్ కో రానున్న ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయి రాజకీయ సమాధి కావడం తథ్యమని స్పష్టం చేస్తున్నారు. చంద్రబాబు కుల దురహంకారంతో టిప్పర్ డ్రైవర్, ఉపాధి హామీ కూలీని కించపరుస్తూ అవమానకరంగా చేసిన వ్యాఖ్యలపై డ్రైవర్లు ఏమంటున్నారో..వారి మాటల్లోనే చూస్తే....

చంద్రబాబు నీచ సంస్కృతికి నిదర్శనం



శింగనమల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు(ఎస్సీ)పై జాతి అహంకారంతో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను సుమోటోగా తీసుకుని ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ కేసు నమోదు చేయాలి. పీజీ చేసిన వీరాంజనేయులుకు చంద్రబాబు హయంలో ఉద్యోగం దొరక్క టిప్పర్ డ్రైవర్‌గా చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటుంటే ఆయనను నిండు సభలో ఎగతాళి చేయడం చంద్రబాబు నీచ సంస్కృతికి నిదర్శనం.

– గోమతోటి వినోద్ పాల్, ఆటో డ్రైవర్, విజయవాడ

టీడీపీకి డ్రైవర్లు ఎందుకు ఓటెయ్యాలి?



డబ్బు లేకపోయినా 50 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు టికెట్లు ఇచ్చిన సీఎం జగనన్నను చూసి చంద్రబాబు సిగ్గు తెచ్చుకోవాలి. ఆత్మగౌరవంతో వృత్తిని చేసుకునే డ్రైవర్లను అవమానించారు. తమలాంటి డ్రైవర్లందరూ టీడీపీకి ఎందుకు ఓటు వెయ్యాలి? పార్టీ కోసం కష్టపడి పనిచేసే సామాన్య కార్యకర్తను సైతం గుర్తుపెట్టుకుని అసెంబ్లీ టికెట్లను ఇచ్చిన ఘనత సీఎం జగనన్నదే. చంద్రబాబుపై పరువు నష్టం కేసు వేయాలి.

– మేశం రాజు, లారీ డ్రైవర్, విజయవాడ

చంద్రబాబు వైఖరి మరోసారి బయటపడింది..



సామాన్యులను వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులుగా ప్రకటించటంతో చంద్రబాబు వైఖరి మరోసారి బయటపడింది. సీఎం జగన్ తీసుకున్న నిర్ణయంతో ప్రతి పేదవాడు తలెత్తుకుని తిరిగే విధంగా ఉంది. నాయకుడు అంటే ముందుకు నడవటమే కాదు.. తన వారిని ముందుండి నడిపించటమేనని జగనన్న మరోమారు రుజువు చేశారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబు అండ్ కోకు తగిన బుద్ధి చెబుతాం.

– జెట్టి కోటేశ్వరరావు, లారీ డ్రైవర్, తాడేపల్లి

పీవీకి భారతరత్న.. తెలుగు జాతికి గర్వకారణం

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



పీవీ నరసింహారావుతో ఎమ్మెల్యే విష్ణు (ఫైల్)

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): దేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్న మన తెలుగు వాడైన మాజీ ప్రధాని పాములపర్తి వెంకట నరసింహారావు సేవలకు గుర్తుగా అందించడం తెలుగుజాతికి ఎంతో గర్వకారణమని ఎమ్మెల్యే మల్లాది విష్ణు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశ సమగ్రాభివృద్ధికి పీవీ సేవలు ఆదర్శనీయమని, దేశ ఆర్థిక వ్యవస్థను తన సంస్కరణలతో గాడిన పెట్టిన మహామేధావి అని కొనియాడారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా, కేంద్రమంత్రిగా, ముఖ్యమంత్రిగా, ప్రధానిగా నిరంతర సంస్కరణశీలిగా అంచెలంచెలు ఎదిగిన ఆయన జీవితం నేటి యువతరానికి ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. మన దేశం ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కి ప్రపంచంతో పోటీ పడే స్థాయికి ఎదిగిందంటే అందులో పీవీ చేసిన కృషి ఎంతో ఉందన్నారు. ఆయన బహుభాషా కోవిదుడని.. 14 భాషలు మాట్లాడగలిగిన ఏకైక ప్రధాని అని గుర్తుచేశారు. అసాధారణమైన ప్రతిభ, జ్ఞానం పీవీ సొంతమని కీర్తించారు. దేశ చరిత్రలో నిరంతర సంస్కరణశీలిగా పీవీ నరసింహారావు చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భూసంస్కరణలకు ఆయనే ఆద్యుడని.. భూసంస్కరణల్లో భాగంగా తన ఆస్తిని ప్రభుత్వానికి అప్పగించినటువంటి మహోన్నత వ్యక్తి అని తెలిపారు. ఉమ్మడి కృష్ణా జిల్లాతో.. ముఖ్యంగా మచిలీపట్నం, విజయవాడ నగరంతో పీవీకి ప్రత్యేక అనుబంధం ఉండేదని ఎమ్మెల్యే అన్నారు. ఆ మహనీయుడి ఆశయాలను ముందుకు తీసుకెళ్లే విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తోందని పేర్కొన్నారు. భావితరాలు పీవీ సేవలను స్మరించుకునే విధంగా సత్యనారాయణపురంలో ఆయన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. ఎన్నికల అనంతరం సీఎం జగన్ చేతులమీదుగా పీవీ విగ్రహావిష్కరణ ఉంటుందన్నారు.

విద్యార్థులకు తాగునీటి సదుపాయం అభినందనీయం



ఆర్ఓ వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న జడ్జి రాజారామ్

పాయకాపురం(విజయవాడరూరల్): విద్యార్థులకు తాగునీటి సదుపాయం కల్పించడం అభినందనీయమని నాల్గవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి పి.రాజారామ్ అన్నారు. రాజీవ్‌నగర్‌లోని రాజీవ్‌గాంధీ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ నందు కోస్టల్ బ్యాంక్ సీఎస్ఆర్ ఫండ్స్‌తో ఏర్పాటు చేసిన ఆర్ఓ ప్లాంటు, షెడ్‌లను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సు కార్యక్రమంలో జడ్జి పి.రాజారామ్ మాట్లాడుతూ సోషల్ సర్వీసెస్ రెస్పాన్స్‌బిలిటీని కోస్టల్ బ్యాంక్ వీటిని అందించినందుకు అభినందించారు. ఆర్ఓ ప్లాంటును ఈ హైస్కూల్లో ఏర్పాటు చేయడానికి న్యాయవాది, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ చంద్రగిరి రాధాకుమారి సహాయ సహకారాలు అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో కోస్టల్ బ్యాంక్ ఏసీఎం ఎస్.మదనమోహన్, రామకృష్ణ, హైస్కూల్ హెచ్ఎం పి.శ్రీనివాసరావు, బీబీఏ ప్రెసిడెంట్ కె.చంద్రమౌళి, బీబీఏ జీఎస్ ఎ.రాజా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.